బడి ముద్దలో గుడ్డు ఉష్ కాకి...

- ప్రభుత్వ పాఠశాల విదార్థులకు నెల రోజులుగా అందని గుడ్డు
- వారానికి ఐదు రోజులు గుడ్డు ఇవ్వాలి
- పట్టించుకోని విద్యాశాఖ అధికారులు

పొన్నూరు: పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. కోడి గుడ్డు సరఫరా నిలిచిపోయింది. ప్రతి నెలలో 4 విడతలుగా ప్రభుత్వ పాఠశాలలకు గుడ్డు సరఫరా చేయాల్సి ఉంది. విద్యార్థులకు అందించే భోజనంలో వారానికి ఐదురోజులు కోడి గుడ్డు ఇవ్వాలి. ధరల కారణంగానే సరఫరా పూర్తిస్థాయిలో నిలిచిపోయినట్లు చెబుతున్నారు.

పట్టణంలోని పాఠశాలలో..

పట్టణంలోని నిడుబ్రోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సుమారు 729 మంది విద్యార్థులు ఉన్నారు. వారిలో సుమారు 600 మంది ప్రతి రోజు మధ్యాహ్నం భోజనం తింటున్నారు. గత 4 వారాలుగా పిల్లలకు గుడ్డు దూరమైంది. అరకొర కూరలతో భోజనం రుచించడం లేదని పలువురు విద్యార్థులు వాపోతున్నారు. ఇలా మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఇదే పరిస్థితి ఉన్నా విద్యాశాఖ అధికారులకు మాత్రం పట్టడం లేదు. విద్యార్థులతో పాటు నిర్వాహకులకు, ఆయాలకు కూడా అవస్థలు తప్పడం లేదు.

➡ పొన్నూరులో ప్రభుత్వ పాఠశాలలు 89





సోమవారం నిడుబ్రోలు జెడ్పీ హైస్కూల్లో గుడ్డు లేకుండా భోజనం చేస్తున్న విద్యార్థులు

ఉన్నాయి. 1 నుంచి 10వ తరగతి వరకు 5,171 మంది విద్యార్థులు పాఠశాలల్లో చదువుతున్నారు. ప్రతి నెలలో మండలంలో మొదటి వారంలో ఫేజ్ 1లో 25,440 గుడ్లు, రెండో వారం ఫేజ్ 2లో 10,184, మూడోవారం ఫేజ్ 3లో 20,312, నాలుగో వారం ఫేజ్ 4లో 30,402 వేల గుడ్లను భోజనంలో విద్యార్థులకు అందించాల్సి ఉంది.

ఉన్నతాధికారుల దృష్టికి సమస్యను తీసుకువెళ్లాం..



మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు గత నాలుగు వారాలుగా కోడిగుడ్డు అందడంలేదు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి సమస్యను పరిష్కరించే విధంగా చర్యలు చేపడతాం.
– శ్రీనివాసరెడ్డి, ఎంఈఓ, పొన్నూరు

క్లుప్తంగా

దంతాలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి



కాకుమాను(పెదనందిపాడు): దంతాలపై ప్రతి ఒక్కరూ ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని దంత వైద్యుడు ఫణీంద్ర తెలిపారు. పెదనందిపాడు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం విద్యార్థులకు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ ఫణీంద్ర మాట్లాడుతూ విద్యార్థులు ఉదయం, సాయంత్రం దంతాలు శుభ్రం చేసుకోవాలన్నారు. చిన్న చిన్న పంటి సమస్యలు వచ్చిన వెంటనే వైద్యులను సంప్రదించి తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. 150 మందికి దంత పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ చైర్మన్ లక్ష్మీనారాయణ, అధ్యక్షులు శివప్రసాద్, నాగేశ్వరరావు, ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మీదుర్గా, దంత వైద్యులు మన్సూర్, విఘ్నేష్, సైదున్నిసా, విద్యార్థులకు ఉచితంగా దంత పరీక్షలు చేశారు.

అమ్మవారి హుండీ కానుకల లెక్కింపు

కాకుమాను: మండల పరిధిలోని కొండపాటూరులోని శ్రీపోలేరమ్మ అమ్మవారి హుండీ కానుకల లెక్కింపు బాపట్ల దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ ఎస్.గోపి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. దేవాలయ ఈఓ బి.సురేష్ మాట్లాడుతూ గత మూడున్నర నెలల నుండి కానుకల రూపేణా అమ్మవారి హుండీ రూ. 5,18,468 ఆదాయం వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో దేవాదాయ అర్చకులు మువ్వా నాగేశ్వరరావు, గ్రామ పెద్దలు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సైబర్ సెక్యూరిటీ అండ్ ఆన్‌లైన్ సేఫ్టీపై సెమినార్



గుంటూరు రూరల్: సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరికి పూర్తి అవగాహన అవసరమని ఏపీ హైకోర్టు న్యాయవాది అనుపమ దార్ల తెలిపారు. సోమవారం చౌడవరం గ్రామంలోని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన సైబర్ సెక్యూరిటీ అండ్ ఆన్‌లైన్ సేఫ్టీపై నిర్వహించిన సెమినార్‌లో ఆమె మాట్లాడుతూ సాంకేతిక యుగంలో ప్రతి వ్యక్తి సాధారణ జీవితంలో ఇంటర్నెట్ వాడకం ఒక భాగమైందని, వ్యక్తిగత సమాచారాన్ని గోప్యంగా ఉంచుకుకోవడం ద్వారానే సైబర్ నేరాల నుండి రక్షణ పొందవచ్చన్నారు. నావిగేటింగ్ ది డిజిటల్ వరల్డ్ : ఎసెన్షియల్ టిప్స్ ఫర్ సైబర్ సెక్యూరిటీ అండ్ ఆన్లైన్ సేఫ్టీ ' అనే అంశంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. సైబర్ నేరాలను అరికట్టడంలో ఉపయోగపడే సులభతరతర మార్గాలను శోధించాలని కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్.శ్రీనివాస్, ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీ మోహన్, డాక్టర్ జగదీష్ మద్దినేని పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ కరెస్పాండెంట్ ఆర్.గోపాలకృష్ణ, ట్రజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస్, డైరెక్టర్ కె.రవీంద్ర, ఏఓ డైరెక్టర్ ఎన్వీ శ్రీనివాసరావు, అవేరా ఎలక్ట్రిక్ స్కూటర్స్ కోఫౌండర్ చాందిని చందన, డాక్టర్ సుదీప్తి వర్ధన్, డాక్టర్ స్వర్ణశ్రీ పాల్గొన్నారు.

అర్జీలు రీ ఓపెన్ కాకుండా చూడాలి



నెహ్రూనగర్: నగరంలో స్థానిక సమస్యల పరిష్కారం కోసం నగరపాలక సంస్థలో చేపట్టే డయల్ యువర్ కమిషనర్, పీజీఆర్ఎస్‌లో ప్రజలు ఇస్తున్న అర్జీలు రీ ఓపెన్ కాకుండా సమగ్రంగా పరిశీలించి, శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు స్పష్టం చేశారు. నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశాల మేరకు సోమవారం నగరపాలక సంస్థ కమిషనర్ ఛాంబర్‌లో డయల్ యువర్ కమిషనర్, కౌన్సిల్ హాల్లో పీజీఆర్ఎస్ నిర్వహించారు. తొలుత డయల్ యువర్ కమిషనర్ ద్వారా ప్రజల నుంచి అందిన 23 ఫిర్యాదులు స్వీకరించారు. సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు 34 ఫిర్యాదులు అందాయని చెప్పారు. కార్యక్రమంలో డెప్యూటీ కమిషనర్ టి.వెంకట కృష్ణయ్య, ఎంహెచ్ఓ డాక్టర్ రవిబాబు, డీసీపీ సూరజ్ కుమార్, మేనేజర్ బాలాజీ బాషా పాల్గొన్నారు

విద్యుత్ వైర్ల అపహరణపై కేసు నమోదు

కాకుమాను(పెదనందిపాడు): మండలంలోని కొప్పర్రు ఎత్తిపోతల పథకానికి సంబంధించిన విద్యుత్ వైర్లు, రాగితీగలు అపహరణకు గురైనట్లు పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. నీటి సంఘం అధ్యక్షురాలు జెట్టి సీతమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఆదివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు విద్యుత్ తీగలు, రాగి వైర్లు చోరీ చేసినట్లు గుర్తించారు.

కేంద్ర హోంమంత్రి అమిత్ షా రాజీనామా చేయాలి



నిరసనలో పాల్గొన్న సీపీఎం, సీపీఐ నాయకులు



పెదకాకానిలో నిరసన

పొన్నూరు: భారత రాజ్యాంగ రూపకర్త డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌పై అవమానకరమైన వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం మంత్రి అమిత్‌షా రాజీనామా చేయాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి పుప్పాల సత్యనారాయణ బుజ్జి డిమాండ్ చేశారు. వామపక్షాల పిలుపు మేరకు ఐలాండ్ సెంటర్‌లో సోమవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా ప్రజానాట్యమండలి కార్యదర్శి అరేటి రామారావు అధ్యక్షత వహించారు. సీపీఎం జిల్లా నాయకుడు దండా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ రాజ్యాంగం పెట్టిన భిక్షతోనే తుక్కు ఐరన్ అమ్ముకొనే అమిత్ షా హోం మంత్రి పదవిని అనుభవిస్తున్నారని అన్నారు. మాల మహాసభ నాయకులు చైతన్య, బీఎస్పీ నాయకులు కిషోర్ బాబు మాట్లాడుతూ హోం మంత్రిగా అమిత్ షా దేశ ప్రజలకు క్షమాపణలు చెప్పి వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గేయ రచయిత దేవరకొండ శ్రీనివాస్, సీపీఎం శాఖ కార్యదర్శి ప్రభుదాసు, నాయకులు రమేష్, సతీష్ గోవిందరాజులు, బాజీ, నాగరాజు, వీర రాఘవులు, ప్రసాద్, వెంకయ్య పాల్గొన్నారు.

చేబ్రోలులో..

చేబ్రోలు: రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌ను అవమానించిన అమిత్‌షా వెంటనే రాజీనామా చేయాలని కోరుతూ సీపీఎం, సీఐటీయూ ఆధ్వర్యంలో చేబ్రోలులోని పాతపోలీసు స్టేషన్ సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు దండా లక్ష్మీ నారాయణ, నాయకులు పల్లా ఆదిశేషు, సీఐటీయూ మండల కార్యదర్శి సీహెచ్ హనుమంతరావు, నాయకులు చింతల శ్రీనివాసరావు, చౌడయ్య, షర్ఫుద్దీన్, థామస్, కమల కిషోర్ పాల్గొన్నారు.

పెదకాకాని: కేంద్ర మంత్రి అమిత్ షా రాజీనామా చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు డిమాండ్ చేశారు. పెదకాకాని గ్రామంలోని జాతీయ రహదారి పక్కనే ఉన్న సర్వీసు రోడ్డులో అమిత్ షా రాజీనామా కోరుతూ సోమవారం సీపీఎం ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల కార్యదర్శి నన్నపనేని శివాజీ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో సీఐటీయూ జాతీయ నాయకులు ఆర్.లక్ష్మయ్య, బురదగుంట సాంబయ్య, కే సత్యనారాయణ, ఆర్ వెంకటేశ్వర్లు, కే రాఘవయ్య, ఆముదాల నాగేశ్వరావు, ఆర్ వెంకటరమణ, ఎస్ వీరమ్మ, గంట జానకి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలకు సత్వర పరిష్కారం



అర్జీ స్వీకరిస్తున్న తహసీల్దార్ జియావుల్‌హక్

పొన్నూరు: వివిధ సమస్యలపై మండల ప్రజల నుంచి వచ్చే అర్జీలను సత్వరమే పరిష్కరించే విధంగా చర్యలు చేపడతామని తహసీల్దార్ జియా వుల్ హక్ అన్నారు. సోమవారం కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో ప్రజల నుంచి ఆయన అర్జీలను స్వీకరించారు. రీసర్వేకు సంబంధించి మూడు, పట్టాదారు పాస్ పుస్తకం కోసం 2 అర్జీలు స్వీకరించి వెంటనే పరిష్కరించాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంఈఓ శ్రీనివాసరెడ్డి, ఎంపీఓ డేగల వెంకట్రామయ్య, ఎంపీడీఓ చంద్రశేఖర్, సీడీపీఓ వెంకట రమణ పాల్గొన్నారు.

లయోలాలో వేడుకగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



పూర్వవిద్యార్థులతో పాఠశాల యాజమాన్యం

గుంటూరు రూరల్: నల్లపాడులోని లయోలా పాఠశాలలో పాఠశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం సోమవారం నిర్వహించారు. రెండు రోజులపాటు నిర్వహించనున్న వేడుకలను పాఠశాల సుపీరియర్ కరస్పాండెంట్ రెవరెండ్ ఫాదర్ డాక్టర్ పోతిరెడ్డి అంథోని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ లయోలా పాఠశాలలో చదివిన విద్యార్థులు వివిధ హోదాల్లో ఉన్నత స్థానాలకు చేరుకోవటం తమకెంతో ఆనందంగా ఉందన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ రెవరెండ్ ఫాదర్ సురేష్‌కుమార్ మాట్లాడారు. పాఠశాల యాజమాన్యం, పూర్వ విద్యార్థి సంఘం సంయుక్తంగా గోల్డెన్ జూబ్లీ వేడుకలు జరుపుకుంటున్న 1973–74 బ్యాచ్ విద్యార్థులను, సిల్వర్ జూబ్లీ జరుపుకుంటున్న 1999 బ్యాచ్ విద్యార్థులను ఘనంగా శాలువాలు కప్పి సన్మానించారు. ఆటపాటలతో, నృత్యాలతో పాఠశాల వాతావరణం పండగవాతావరణం చోటు చేసుకుంది. కార్యక్రమంలో పాఠశాల పూర్వ విద్యార్థి సంఘం అధ్యక్షుడు కృష్ణారెడ్డి, వైస్ ప్రెసిడెంట్ రమేష్, కార్యనిర్వాహకులు ప్రసాద్, కోశాధికారి అనిల్ కుమార్ పాల్గొన్నారు.

చిప్స్‌లో ముగిసిన అంతర కళాశాలల వాలీబాల్ పోటీలు



పోటీలలో విజేతలతో కళాశాల యాజమాన్యం

గుంటూరు రూరల్: నగర శివారుల్లోని చౌడవరంలోని చిప్స్ ఫార్మసీ కళాశాలలో ఆచార్య నాగార్జున యూనివర్సిటీ అంతర్ కళాశాలల ఉమెన్ వాలీబాల్ టోర్నమెంట్ సోమవారంతో ముగిసింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.విద్యాధర్ మాట్లాడుతూ ఈ అంతర్ కళాశాలలో పోటీలకు నాగార్జున యూనివర్సిటీ పరిధిలోని మొత్తం పది టీమ్స్ వచ్చాయని వారికి రెండు రౌండ్లుగా ఈ పోటీలు నిర్వహించటం జరిగిందన్నారు. మొదటి రౌండ్ నాకౌట్ పద్ధతిలో జరగగా, ఈ రౌండ్‌లో విజేతలుగా నిలిచిన వారిని రెండో రౌండ్‌కి సెలెక్ట్ చేయటం జరిగింది. రెండో రౌండ్ లీగ్ పద్ధతిలో నిర్వహించి మొదటి నాలుగు స్థానాలలో నిలిచిన టీమ్స్‌ని అభినందించారు. పోటీలలో మొదటి స్థానంలో జేఎంజే తెనాలి, రెండో స్థానంలో బాపట్ల ఆర్ట్స్ అండ్ సైన్స్, మూడో స్థానంలో యూనివర్సిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాలల టీమ్స్ నిలిచాయి. ఈ అంతర్ కళాశాలల పోటీలలో విజేతలకు ధ్రువీకరణ పత్రాలతో పాటు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్.శ్రీనివాస్, సెక్రటరీ సీఎస్ శ్రీనివాస్, కోశాధికారి డాక్టర్ ఆర్.గోపాలకృష్ణ, సంయుక్త కార్యదర్శి చుక్కపల్లి రమేష్, గోపీచంద్, వి. కుప్పుస్వామి పాల్గొన్నారు.

బీజేపీ మండల అధ్యక్షుడిగా గంగాధరరావు

కాకుమాను(పెదనందిపాడు): బీజేపీ పెదనందిపాడు మండల అధ్యక్షుడిగా మెలగా గంగాధరరావు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు పార్టీ సంస్థాగత ఎన్నికల అధికారి టి.కృష్ణారెడ్డి, వై.వి.సుబ్బారావు తెలిపారు. స్థానిక పార్టీ కార్యాలయంలో సోమవారం పార్టీ మండల అధ్యక్ష ఎన్నికలు నిర్వహించారు. ఈసందర్భంగా వరగాని గ్రామానికి చెందిన వెలగ గంగాధరరావును పార్టీ మండల అధ్యక్షుడిగా ఎంపిక చేసినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పరాంకుశం శ్రీనివాసరావు, పాండురంగ విఠల్, జంధ్యాల రామలింగేశ్వరశాస్త్రి, జిల్లా నాయకులు తోటా శ్రీనివాసరావు, కన్న రవిదేవరాజు, బి.రవి, తదితరులు నూతనంగా ఎన్నికైన గంగాధరరావును సన్మానించారు.

విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌కు ఎస్టీయూ కృషి



వెనిగండ్లలో పుస్తకాలు పంపిణీ చేస్తున్న అతిథులు

పెదకాకాని: విద్యార్థుల ఉజ్వల ఉన్నతికి ఎస్టీయూ కృషి అభినందనీయమని ఎంపీడీఓ రమావత్ శ్రీనివాసరావు అన్నారు. పెదకాకాని మండలంలోని వెనిగండ్ల జెడ్పీ హెచ్ స్కూల్‌లో సోమవారం (2024–25) పదో తరగతి విద్యార్థులకు ఉపయోగపడేందుకు రూపొందించిన 152 పేజీల ముఖ్యమైన విషయ పరిజ్ఞానపు పుస్తకాన్ని విద్యార్థులకు ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎంపీడీఓ ఆర్.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎస్టీయు ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులు అందజేస్తున్న ముఖ్య విజయ పరిజ్ఞాన పుస్తకం ఉత్తమ ఫలితాలు సాధించేందుకు దోహదపడుతుందన్నారు. మండల విద్యాశాఖాధికారి వి.శంకరరావు పదవ తరగతి విద్యార్థులకు ఉచితంగా ముఖ్య విషయ పరిజ్ఞాన పుస్తకాన్ని రూపొందించి పంపిణీ చేస్తున్న ఎస్టీయూ ఉపాధ్యాయ సంఘాన్ని అభినందించారు. అలానే పుస్తకాల ముద్రణకు ఆర్థిక సహకారం అందించిన ఉపాధ్యాయినీలు వి జ్యోతి, జి అనిత, బి పెర్సిరాజశ్రీలను అధికారులు ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం మండల అధ్యక్షులు ఎం.జోసఫ్, గౌరవాధ్యక్షులు ఎం దేవపాల్, జిల్లా కౌన్సిలర్ పి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

యువతకు ఉపాధి అవకాశాలపై అవగాహన సదస్సు



కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ సరస్వతిరాజుఅయ్యర్

గుంటూరు రూరల్: యువత నైపుణ్యాలను పెంపొందించుకోవడం ద్వారానే అవకాశాలను అందుకోగలరని నాగార్జున విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ సరస్వతిరాజు అయ్యర్ తెలిపారు. శనివారం గోరంట్లలోని బి స్క్వేర్ కన్వెన్షన్ హాలులో దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో యువత, ఉపాధి, సవాళ్లు, అవకాశాలు అనే అంశంపై రాష్ట్ర సదస్సు నిర్వహించారు. సదస్సుకు దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఎగ్జిక్యూటివ్ సెక్రెటరీ అల్లడి దేవకుమార్ అధ్యక్షత వహించారు. ప్రముఖ సీనియర్ సైకాలజిస్ట్ డాక్టర్ ప్రత్యూష సుబ్బారావు మాట్లాడుతూ యువత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్, గౌతమ బుద్ధుని బోధనలను అనుసరించి తమ భవిష్యత్తును తామే తీర్చుకోవాలని సూచించారు. ఎస్బీఐ మేనేజర్ మేడికొండ సునీల్, రూట్ సెట్ డైరెక్టర్ పీవీ కుమార్, పీఎంఎఫ్ఎంఈ సాయికృష్ణ మాట్లాడారు.

పన్ను బకాయిలపై దృష్టి సారించాలి

కమిషనర్ పులి శ్రీనివాసులు

నెహ్రూ నగర్: గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో ఆస్తి, ఖాళీ స్థల, నీటి కుళాయి, మీటర్ల బకాయిల వసూలుకు చర్యలు వేగవంతం చేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. కమిషనర్ ఛాంబర్‌లో అదనపు కమిషనర్, డెప్యూటీ కమిషనర్, రెవెన్యూ అధికారులు, ఇన్‌స్పెక్టర్లు ఆస్తి, ఖాళీ స్థల పన్ను, నీటి మీటర్ల చార్జీల వసూలు వేగవంతంపై సమీక్ష సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ రెవెన్యూ ఇన్స్పెక్టర్ల వారీగా పన్నుల వసూలుపై సమీక్షించి, వసూలు లక్ష్యానికి తగిన విధంగా లేవని, రాబోవు రెండు రోజుల్లో వార్డు సచివాలయాల వారీగా అడ్మిన్ కార్యదర్శులు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు పన్ను వసూలుకు ప్రత్యేక యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసుకోవాలన్నారు. పన్ను వసూళ్లలో నిర్లక్ష్యం, సరికాదని, మార్చి నాటికి నూరు శాతం పన్ను వసూలు జరగాలని, పురోగతి లేకుంటే చర్యలు తప్పవన్నారు. సమావేశంలో అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, డెప్యూటీ కమిషనర్ టి.వెంకట కృష్ణయ్య, రెవెన్యూ అధికారులు బాలాజీ బాషా, రెహ్మాన్, సాదిక్ భాష, రవి కిరణ్ రెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఓటర్ల తుది జాబితా విడుదల

పొన్నూరు: ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి పొన్నూరు నియోజకవర్గంలో ఓటరు తుది జాబితాను సోమవారం తహసీల్దార్ మహమ్మద్ జియావుల్‌హక్ విడుదల చేశారు. అనంతరం వివరాలను ఆయన వెల్లడించారు. నియోజకవర్గంలో మొత్తం 7,962 ఓటర్లు ఉన్నారని తెలిపారు.

పొన్నూరు నియోజకవర్గంలో ఓటరు వివరాలు..

మండలం	పోలింగ్ కేంద్రం	పురుషులు	మహిళలు	మొత్తం
పొన్నూరు పట్టణం	261	612	407	1019
పట్టణం	262	667	479	1146
పొన్నూరు మండలం	263	594	313	908
పొన్నూరు మండలం	264	300	210	510
చేబ్రోలు	265	565	298	863
చేబ్రోలు	266	648	363	1011
పెదకాకాని	269	483	252	735
పెదకాకాని	270	387	288	675
పెదకాకాని	271	681	414	1095
		4937	3024	7962

సవాళ్లను ఎదుర్కొని లక్ష్యాన్ని చేరుకోవాలి

ప్రొఫెసర్ జి.ఉమామహేశ్వరరావు



జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ప్రొఫెసర్ జి.ఉమామహేశ్వరరావు

ఏఎన్‌యూ: విద్యార్థి దశలో అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవడం కోసం ఎన్ని సవాళ్లు ఎదుర్కొన్నా లక్ష్య సాధన మరువకూడదని హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయ లింగ్విస్టిక్ ప్రొఫెసర్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు ప్రొఫెసర్ జి.ఉమామహేశ్వరరావు అన్నారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో సోమవారం ఆర్ట్స్ కామర్స్ అండ్ లా, సైన్స్, ఫార్మసీ, వ్యాయామ విద్య, ఆర్కిటెక్చర్ అండ్ ప్లానింగ్ కళాశాలలు సంయుక్తంగా ఇండక్షన్ అండ్ ఓరియంటేషన్ ప్రోగ్రాం నిర్వహించాయి. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ ఆంగ్ల మాధ్యమంలో ఉన్న పుస్తకాలను మాతృభాషలో అనువాదం చేయించి విద్యార్థులకు అందుబాటులో ఉంచాల్సిన అవసరం ఉందన్నారు. శాస్త్ర సాంకేతిక రంగాల్లో అత్యధిక సంఖ్యలో ఆవిష్కరణ చేస్తున్న దేశాలన్నీ కూడా విద్యాబోధనను వారి మాతృభాషలోనే బోధిస్తున్నాయని గుర్తు చేశారు. హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయ మేనేజ్మెంట్ డీన్ ప్రొఫెసర్ బెల్లంకొండ రాజశేఖర్ మాట్లాడుతూ విద్యార్థులు తమ లక్ష్యాలను గుర్తు ఎరగాలని తద్వారా వాటి సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. వీసీ ఆచార్య కే గంగాధర రావు మాట్లాడుతూ వర్సిటీ క్యాంపస్‌లో ఉన్న వసతుల్ని విద్యార్థుల సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఆర్ట్స్, కామర్స్, లా కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎం.సురేష్ కుమార్, రెక్టార్ కె.రత్న షీలా మణి, రిజిస్ట్రార్ జి.సింహాచలం, వర్సిటీ కళాశాలల ప్రిన్సిపాల్స్ కె.వీరయ్య, పి.జాన్సన్, ఎ.ప్రమీలరాణి, ఇన్‌చార్జి ఓఎస్డీ ఆచార్య ఆర్‌వీఎస్ఎస్ఎన్ రవికుమార్ శుభాకాంక్షలు తెలిపారు.

విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

గుంటూరు రూరల్: మండలంలోని వెంగళయపాలెంలో ఆదివారం అర్ధరాత్రి విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధమైంది. వివరాలు... గ్రామానికి చెందిన యల్లటూరి జయరాంబాబు అనే వికలాంగుడు కూలీ పనులు చేసుకుని భార్యా బిడ్డలతో జీవిస్తున్నాడు. రాత్రి భోజనాలు ముగిశాక అందరూ నిద్రపోతుండగా అకస్మాత్తుగా ఇంటిపై కప్పులో మంటలు రేగటంతో అందరూ ఇంటి నుంచి నిద్రలేచి బయటకు వచ్చారు. స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పివేశారు. కట్టుబట్టలతో రోడ్డున పడ్డామని బాధితులు వాపోయారు.